## విద్యుత్ పోలుకు బైక్ ఢీకొని యువకుడి మృతి

ఇల్లంతకుంట, డిసెంబర్ 10: మండలంలోని పొత్తూరు గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కురుమ మహేశ్(18) అనే యువకుడు మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు.. పొత్తూరు గ్రామానికి చెందిన కురుమ మహేశ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం పని ముగించుకుని తన బైక్‌పై ఇంటికి వస్తుండగా, వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న విద్యుత్ పోలుకు ఢీకొన్నది. దీంతో తీవ్రగాయాలపాలైన మహేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# స్వశక్తి సంఘాలకు రుణాలు

- ఎన్నికల నేపథ్యంలో బ్రేక్
- పంపిణీకి అధికారుల సన్నాహాలు
- అంచనాలు రూపొందిస్తున్న బ్యాంకర్లు



మహిళలతో సమావేశమైన అధికారులు

కలెక్టరేట్, డిసెంబర్ 10: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్వయం సహాయక సంఘాలకు రుణ మంజూరుప్రక్రియకు తాత్కాలింగా బ్రేక్ పడ్డది. కొన్ని నెలలుగా గ్రామీణాభివృద్ధిశాఖాధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. దీంతో రుణాల పంపిణీలో ఆలస్యం జరిగింది. ఎన్నికలు ముగియడంతో స్వశక్తి సంఘాలకు రుణాలివ్వడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బ్యాంకర్లు కూడా తమకు నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేసి, కొత్త ఆర్థిక సంవత్సరానికి అంచనాలు రూపొందించేందుకు సిద్ధమవుతున్నారు. రెండు మాసాలుగా సాధారణ ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న అధికార యంత్రాంగం, త్వరలో పంచాయతీ, అనంతరం సార్వత్రిక ఎన్నికలు కూడా జరిగే అవకాశాలుండడం, ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం కూడా సమీపిస్తుండగా, ఈలోపే లక్ష్యం పూర్తి చేయాలంటూ గ్రామీణాభివృద్ధిశాఖ బ్యాంకర్లను కోరింది. దీంతో, ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న సంఘాలకు శరవేగంగా రుణాలు మంజూరు చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో 849 గ్రామైక్య సంఘాలుండగా, వీటి పరిధిలో 22,300 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిలో 2,47,726 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరంతా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారే కావడంతో వీరి కుటుంబాల ఆర్థికాభివృద్ధి కోసం 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో రూ.92 కోట్ల 64లక్షల 84వేలు రుణంగా అందించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఇప్పటివరకు 351గ్రామైక్య సంఘాల పరిధిలో1951 స్వయం సహాయక సంఘాల్లోని 4855 మంది సభ్యులకు రూ.39 కోట్ల 8లక్షల 49వేల రుణ పంపిణీ చేశారు. సంఘాల అర్హత, వారు చెల్లించే క్రమాన్ని బట్టి సాయం పెంచుతూ, బ్యాంకు లింకేజీ రుణాన్ని సంఘాల ఖాతాల్లో జమచేస్తారు. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకర్లు రుణాలు విడుదల చేస్తుంటారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నెల నుంచే రుణ పంపిణీ ప్రారంభించినా, స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల్లో ఎక్కువ మంది వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావడంతో, రుణాలు పొందడంలో కొంతమేర జాప్యం కలిగింది. ఈలోపే అక్టోబర్‌లో ఎన్నికల షెడ్యూల్ రావడం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వర్తింపజేయడం, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించడంతో మిగిలిన సంఘాలకు రుణాల పంపిణీ నిలిచింది. ప్రస్తుతం ఎన్నికలు ముగిసి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. మరో నెల రోజుల్లో పంచాయతీ పోరు ప్రారంభమయ్యే అవకాశాలుండగా, ఈలోపే రుణ లక్ష్యం పూర్తి చేసేందుకు స్త్రీనిధి అధికారులు పరుగులు తీస్తున్నారు. గ్రామాల్లోని ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు రుణాలు పొందిన వారిని చెల్లింపులపై దృష్టి సారించేలా, ఇంకా రుణాలు అందాల్సిన వారిని వెంటనే దరఖాస్తు చేసుకోవాలంటూ సూచిస్తున్నారు. జనవరి నెలాఖరు వరకే నిర్దేశించిన మేరకు రుణ లక్ష్యం పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నారు.

### జనవరిలోనే లక్ష్యాన్ని అధిగమిస్తాం..

జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా అందించే రుణ లక్ష్యం కొత్త ఏడాది ఫస్ట్ నెలలోనే చేరుకునేందుకు కృషి చేస్తున్నాం. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మూడు నెలల గడువు ఉన్నది. అయితే, పంచాయతీ, అనంతరం పార్లమెంటు ఎన్నికలు జరిగే అవకాశాలుండగా, వచ్చే నెలలోనే లక్ష్యం చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ప్రతి మండలంలో అవసరమైన చర్యలు చేపట్టాలని ఇప్పటికే తమ సిబ్బందిని ఆదేశించాం. సక్రమంగా తిరిగి చెల్లించేవారికి, మరింత అదనంగా అందజేసేలా బ్యాంకర్లకు సూచనలు చేస్తున్నాం.

*- ఎల్.శ్రీలత, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి*

# బడిబయట పిల్లల గుర్తింపు సర్వేకు శ్రీకారం

- నేటి నుంచి జనవరి 10 వరకు నిర్వహణ
- మార్గదర్శకాలు జారీ చేసిన విద్యాశాఖ
- వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని నిర్దేశం



గంభీరావుపేట మండలంలో దమ్మన్నపేటలో సర్వే చేస్తున్న సీఆర్‌పీలు (ఫైల్)

సిరిసిల్ల, డిసెంబర్ 10: 'అందరూ చదవాలి..అందరూ ఎదగాలి' అనే లక్ష్యంతో ముందుకెళ్తున్న సర్కారు బడి బయట పిల్లల గుర్తింపు సర్వేకు శ్రీకారం చుట్టింది. బాలబాలికలను గుర్తించి స్కూళ్లలో చేర్పించే ఉద్దేశంతో రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. నేడు డిసెంబర్ 11 నుంచి వచ్చేనెలా 10వతేదీ వరకు సర్వే నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది.

డ్రాపవుట్స్, బడికి వెళ్లనివారిని గుర్తించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు ప్రబంధ పోర్టల్‌ను రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రతి కాంప్లెక్స్ పాఠశాల పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు( సీఆర్పీలు) ఈ బాధ్యతను అప్పగించారు. జిల్లాలో 337 ప్రాథమిక పాఠశాలలు, 38ప్రాథమికోన్నత పాఠశాలలు 131 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సీఆర్పీలు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారి వయస్సును బట్టి ఆయా స్థాయి పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుంది. గత విద్యాసంవత్సరం నిర్వహించిన సర్వేలో దాదాపు 40 మంది పిల్లలను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీరందరిని సమీపంలోని స్కూళ్లల్లో చేర్పించారు.

### నేటి నుంచి సర్వే షురూ..

నేటి నుంచి సీఆర్పీలు తమ పరిధిలోని గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించే ప్రక్రియను ప్రారంభించనున్నారు. సర్వేలో బడి బయట ఉన్న 6 నుంచి 14 ఏండ్ల వరకు, 15 నుంచి 19 ఏండ్ల వరకు పిల్లలను గుర్తించి విద్యాశాఖ అధ్వర్యంలో రూపొందించిన ప్రబంధ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయనున్నారు.

### మూడు స్థాయిల్లో గుర్తింపు

బడి బయట పిల్లలను గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా. విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలోని 51 మంది సీఆర్పీలు ఐఆర్‌పీలు, డీఎంఎల్‌టీలు సర్వే ప్రారంభించనున్నారు. వీరు సేకరించిన సమాచారాన్ని మొదటి స్థాయిలో ఆయా కాంప్లెక్స్ పరిధిలో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్, రెండోస్థాయిలో మండల విద్యాధికారి, మూడోస్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో జరగనున్నది. ఈ క్రమంలో చేపట్టిన సర్వేల్లో బడి బయట పిల్లల గుర్తింపు పారదర్శకంగా జరిగేలా అధికారుల చర్యలు తీసుకుంటున్నారు. వీరందరినీ స్కూళ్లల్లో చేర్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

# మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



డిపో - 1లో ఉచిత ప్రయాణం బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, ఆర్ఎం సుచరిత

తెలంగాణచౌక్, డిసెంబర్ 10: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ సూచించారు. నగరంలోని బస్టాండ్ ఆవరణలోని డిపో–1లో ఆదివారం ఉచిత ప్రయాణం బస్సును జిల్లా వైద్య అధికారి లలితాదేవి, ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సుచరితతో కలిసి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళలు, బాలికలు, విద్యార్థినులు ఎలాంటి చార్జీలు చెల్లించకుండా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. అర్హులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకం కేవలం రాష్ట్రానికి చెందిన మహిళలకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఉచిత ప్రయాణంపై మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారన్నారు. టీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సుచరిత మాట్లాడుతూ, ప్రయాణ సమయంలో టికెట్ తీసుకోకుండా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం గురించి డ్రైవర్లు, కండక్టర్లు వివరిస్తున్నారని తెలిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఉచిత ప్రయాణ సమయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి బస్టాండ్‌లో ప్రత్యేక సిబ్బంది సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్లు మల్లేశం, మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాలీ ఆటో బైక్ ఢీ: ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు
- బోయినపల్లి మండలం కొదురుపాక వద్ద ఘటన
- మృతుడిది వరంగల్ జిల్లా కాజీపేట

బోయినపల్లి, డిసెంబర్10: ట్రాలీ ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బోయినపల్లి మండలం కొదురుపాక కేడీసీసీబీ వద్ద ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. ఎస్ఐ మహేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా బాపూజీ నగర్ కాజీపేటకు చెందిన సిరిమల్ల పూర్ణచందర్ (39), నూతి సాయికిరణ్ బైక్‌పై శనివారం సాయంత్రం రాజన్న దర్శనానికి వేములవాడకు వచ్చారు. ఆదివారం స్వామివారి దర్శనం అనంతరం తిరుగు పయనమయ్యారు. కొదురుపాక కేడీసీసీబీ వద్ద సిరిసిల్ల–కరీంనగర్ రహదారిపై వీరి బైక్. కరీంనగర్ నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పూర్ణచందర్ అక్కడికక్కడే మరణించాడు. సాయికిరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో వెనుక నుంచి బైక్‌పై వస్తున్న కోనరావుపేట మండలం ధర్మారం చెందిన జక్కని రాజు అదుపుతప్పి కింద పడ్డాడు. పోలీసులు స్థానికుల సహకారంతో క్షతగాత్రులు, మృతదేహాన్ని '108'లో కరీంనగర్ దవాఖానకు తరలించారు. కాగా, ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194